క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో అన్నదానం

ఓల్డ్‌బోయిన్‌పల్లి: టీపీసీసీ సభ్యులు డాక్టర్ సత్యం శ్రీరంగం పుట్టినరోజు సందర్భంగా ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ నాయకులు నల్లోల రాజేందర్ , అశోక్, కుమారస్వామి, ఎండీ మొయిజ్, వాజీద్, మహేష్, బాలకృష్ణ కేక్ కట్ చేసి వారికి అందజేశారు. వృద్ధులను ఆప్యాయంగా పలకరించి వంటా వార్పు చేసి వారికి తినిపించారు.

పరామర్శ

కూకట్‌పల్లి: మూసాపేట ప్రగతినగర్‌లో సైడ్ వాల్ కూలి ఓ చిన్నారి మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వర రావు సోమవారం సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మూసాపేట కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్‌తో కలిసి వారి నివాసానికి వెళ్లి మృతి చెందిన చిన్నారి తల్లిదండ్రులను ఓదార్చి వారికి అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు. అనంతరం వారికి ఆర్థిక సహాయం అందజేశారు. వారికి ధైర్యం చెప్పి భవిష్యత్‌లో వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

మోతీనగర్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ ప్రెసిడెంట్ రాజేష్ కౌశల్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు గోవింద్ రాయ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేపీ సీసీటీఎస్‌వీఆర్ నాయుడు, నర్సింలు, ఏవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతి

భాగ్యనగర్‌కాలనీ: ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు అనిల్‌రెడ్డి తన అభిమానం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాల పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు చేయూతను అందించారు. ఒక్కొక్కరికి పదివేల రూపాయల చొప్పున 10మందికి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ల చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ రెడ్డి మాట్లాడుతూ.. గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమానికి ఆకర్షితుడినై తన అభిమాన తన నాయకుడు నవీన్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా అందజేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, విద్యార్థి విభాగం నాయకుడు ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఫ్లైఓవర్ పై నుంచి దూకి వ్యక్తి మృతి



ప్రసాద్ (ఫైల్)

బాలానగర్: బాలానగర్ ఫ్లై ఓవర్ నుంచి మద్యం మత్తులో కిందకు దూకిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోమటిబస్తీలో రేష్మ, ప్రసాద్ దంపతులు నివాసం ఉంటున్నారు. మద్యానికి బానిసైన ప్రసాద్ (32) సోమవారం ఉదయం మద్యం తాగి భార్యతో గొడవ పడ్డాడు. పనికి వెళ్లకుండా ఇంట్లో ఉంటున్నావు పనికి వెళ్లమని భార్య చెప్పటంతో చనిపోతానని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. బాలానగర్ ఫ్లై ఓవర్ ఎక్కి గండమ్మ తల్లి గుడి సమీపంలో పై నుంచి కిందకి (ఉదయం 11.30గంటలకు) దూకాడు. తీవ్ర గాయాల పాలైన ప్రసాద్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు నిర్మాణమెప్పుడు?

- శ్రీహరినగర్‌లో రోడ్లపైనే అక్రమ పార్కింగ్
- పార్కింగ్‌పై చర్యలు తీసుకోని అధికారులు
- చిరువ్యాపారుల డబ్బాలను తొలగించిన వైనం
- పార్కింగ్‌ను పట్టించుకోరు కానీ మాపై ప్రతాపం : చిరువ్యాపారులు



శ్రీహరినగర్‌లో రోడ్డు మధ్యలో వాహనాల పార్కింగ్

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని శ్రీహరినగర్‌లో రోడ్లపై, రోడ్ల మధ్యలో ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేయటంతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాకపోకల సమయంలో వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడి గాయాల పాలవుతున్నారు. రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవటం లేదు. ఇటువంటి సమస్యను పట్టించుకోని సంబంధింత అధికారులు చిరువ్యాపారులపై తమ ప్రతాపాన్ని చూపి వారు ఏర్పాటు చేసుకున్న చిన్న చిన్న షెడ్లను, షాపులను ధ్వంసం చేసి తీసుకెళ్లారు. అసలు సమస్యను పట్టించుకోకుండా చిరు వ్యాపారులపై ప్రతాపం చూపారని పలువురు పేర్కొంటున్నారు.

◆ శ్రీహరినగర్‌లో హైటెన్షన్ లైన్ కింద రోడ్డు విస్తీర్ణం, రోడ్డు నిర్మాణం కొన్ని సంవత్సరాల నుంచి ప్రతిపాదన ఉంది. పలుమార్లు స్థానిక ప్రజలు ప్రజా ప్రతినిధులు, అధికారుల వద్దకు వెళ్లి వారి దృష్టికి తీసెకెళ్లినా సమస్యను అప్పటి నుంచి ఇప్పటి వరకు పట్టించుకోలేదు.

◆ రోడ్డు నిర్మాణం చేపడితే ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య, ఇతర సమస్యలు ఉండనే ఉండవు. రోడ్డు నిర్మాణం లేకపోవటంతో పలు వాహనాలు రోడ్డు మధ్యలో, రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తున్నారు. రాత్రి సమయాల్లోనే కాక పగలు కూడా వాహనాలు అలాగే పార్కింగ్ చేసి ఉంచుతున్నారు.

◆ రాత్రి సమయాల్లో అయితే వాహనాలు వెళ్లేందుకు కూడా వీలు లేకుండా అడ్డుగా ఉంటాయి. స్థానికులకు కూడా ఈ విషయంపై గొడవలు జరుగుతుంటాయి. రాత్రి సమయమే కాక పగలు కూడా రోడ్డు మధ్యలో వాహనాల పార్కింగ్ ఉంటుంది. ఈ కాలనీ ప్రజలే కాకుండా చుట్టు పక్కల కాలనీ ప్రజలు కూడా ఈ ప్రాంతంలో వాహనాలు పార్కింగ్ చేస్తుంటారు.

◆ రోడ్డు నిర్మాణం జరిగి, అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకుంటే తమ కాలనీలో ఎటువంటి సమస్యలు ఉండవని స్థానిక ప్రజలు తెలిపారు.

◆ అయితే ఇటువంటి పెద్ద సమస్యలను పట్టించుకోని అధికారులు చిరువ్యాపారులపై ప్రతాపం చూపుతూ వారి వ్యాపారాలను దెబ్బతీసే విధంగా షెడ్లను ధ్వంసం చేసి తీసుకెళ్లారు. ఇప్పటికీ కొందరు చిరువ్యాపారస్తులు కోలుకోలేని పరిస్థితిలో ఉన్నారు.

◆ వృద్ధ దంపతులు గత 30 సంవత్సరాల నుంచి ఆ ప్రాంతంలో చెప్పులు కుట్టుకుంటూ జీవనం కొనసాగించేవారు. ఆ దంపతులకు ఆ చెప్పులు కుట్టుకునే వృత్తే ఆధారం. అది కూడా లేకుండా అధికారులు షాపును పూర్తిగా ధ్వంసం చేసి తీసుకెళ్లారు. ఇప్పటికీ వృద్ధ దంపతులు షెడ్డు లేక చెట్టు కిందనే రోడ్డుపై చెప్పులు కుట్టుకుంటున్నారు. మధ్యాహ్న సమయంలో ఎండలో కూడా అలాగే ఉంటు, అక్కడే భోజనాలు కూడా చేయాల్సి వస్తోంది.



చెప్పులు కుట్టుకునే షాపును తొలగించటంతో ఎండలోనే పనులు చేసుకుంటున్న వృద్ధురాలు

డివైడర్ నిర్మించాలి..



రోడ్డు మధ్యలో పార్కింగ్‌తో స్థానికంగా పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక పలుమార్లు ప్రమాదాలు కూడా జరిగాయి. హైటెన్షన్ లైన్ కింద రోడ్డు నిర్మాణం చేసి డివైడర్ కూడా నిర్మించాలని కోరుతున్నాం. పార్కింగ్ వల్లనే అనేక ఇబ్బందులు ఉన్నాయి.

– శంకర్, స్థానికుడు

మా షాపును తిరిగి ఇవ్వాలి..



చెప్పులు కుట్టుకుంటూ మూసాపేటలోనే జీవిస్తున్నాం. తొలగించమని చెబితే తీసేవాళ్లం. కానీ షాపును పూర్తిగా ధ్వంసం చేసి తీసుకెళ్లారు. ఇప్పుడు మాకు నీడ కరువైంది. ఎండకు ఎండుతున్నాం. వానకు తడుస్తున్నాం. వర్షం పడితే సామాన్లు తీసుకెళ్లే సత్తువ మాకు లేదు. అధికారులు కరుణించి మాకు షాపును తిరిగి ఇవ్వాలని కోరుతున్నాం.

– రాధాబాయి, వృద్ధురాలు

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు



కార్యకర్తల నడుమ భారీ కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ తదితరులు

కూకట్‌పల్లి: ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌కుమార్ జన్మదిన వేడుకలు అభిమానులు, కార్యకర్తల సందడితో ఘనంగా జరిగాయి. కూకట్‌పల్లిలోని ఆయన నివాసంలో సోమవారం జరిగిన వేడుకల్లో నగరంలోని వివిధ నియోజకవర్గాలకు సంబంధించిన కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, అధికారులు, మిత్రులు భారీ ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీ, కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలకు చెందిన కార్పొరేటర్‌లు, కార్యకర్తలు తీసుకొచ్చిన భారీ కేక్‌ను ఆయన కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నివాసితులు, పారిశ్రామికవేత్త కె. కొండల్‌రావు, ఏడీఆర్ ట్రస్ట్ అధినేత దామోదర్ పటేల్, రాఘవేందర్‌రావు, భాస్కర్, రామారావు, భాస్కర్‌రావు, కుర్మయ్యగారి సత్యం, నాగరాజు, చౌదరి ఆదిత్య, కంచనపల్లి నాగరాజు, సతీష్ అరోరా, మారేపల్లి శ్రీనాథ్, అభిలాష్‌రావు, కూన అమ్రేష్‌గౌడ్, రంజిత్, బొట్టు విష్ణు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

వృద్ధ దంపతుల అదృశ్యం

బాలానగర్: షిరిడీ వెళ్లొస్తామని వెళ్లిన వృద్ధ దంపతులు అదృశ్యమైన తిరిగి ఇంటికి రాని సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. కళ్యాణినగర్‌లో అనిల్ అగర్వాల్ తన కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. గత నెల 30వ తేదీన అనిల్ అగర్వాల్ తల్లిదండ్రులు శ్యామ్ అగర్వాల్ (63), మంజు అగర్వాల్ (61) ఇద్దరు షిరిడీ వెళ్లొస్తామని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లారు. అయితే అప్పటి నుంచి వారి సెల్‌ఫోన్‌లు పనిచేయడం లేదు. దాంతో పలుచోట్ల గాలించినప్పటికి ఆచూకీ లభ్యం కాలేదు. కూతురు అనితఅగర్వాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





శ్యామ్, మంజు అగర్వాల్ (ఫైల్)

బంగారు తెలంగాణ బీజేపీతోనే సాధ్యం

కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: తెలంగాణ ఏర్పాటుతో తమ బతుకులు మారతాయన్న కోట్లాది ప్రజల ఆశలు కేసీఆర్ పాలనలో అడియాశలయ్యాయని కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు అన్నారు. 'మరోసారి మోదీ సర్కార్.. ఈసారి తెలంగాణలో బీజేపీ సర్కార్' అనే నినాదంతో సోమవారం చాముండేశ్వరీ అలయం నుంచి కోయ బస్తీ, సిక్కుల బస్తీ, హరిజనబస్తీలలో బీజేపీ భరోసా యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, నాయకులతో ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వ పథకాలతో కూడిన కరపత్రాన్ని అందజేశారు.కేంద్ర పథకాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అధికారంలోకి రాగానే విద్య, వైద్యం ఉచితంగా అందిస్తామన్నారు. నిరుద్యోగులకు జాబ్ కేలండర్ ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సూర్యరావు, సంతోష్‌యాదవ్, ఎనుగుల తిరుపతి, పుప్పు పటేల్, రవిగౌడ్, రఘు, సత్యమూర్తి, జగదీష్, బల్బీర్‌సింగ్, వేణుగోపాల్, శంకర్, కార్తీక్, సాయి, లక్ష్మి, శేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



భరోసా యాత్రలో ఓ వృద్ధురాలితో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

అల్లాపూర్‌లో నూతన పోలీస్‌స్టేషన్ ప్రారంభం



పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ తదితరులు

మోతీనగర్: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అల్లాపూర్‌లో నూతన పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సీపీ స్టీఫెన్ రవీంద్ర, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్ సబిహా బేగం, బాలానగర్ జోన్ డీసీపీ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడమన్నారు. యువత గంజాయి మత్తులో తేలకుండా ఉండేందుకు అనుక్షణం పోలీసులు ఇక్కడ పనిచేస్తారని అన్నారు. ఇక వారి ఆటలు సాగవన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను చెడు అలవాట్లకు దూరంగా ఉండేటట్లు చూడాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు సతీష్‌గౌడ్, ఆవుల రవీందర్‌రెడ్డి, నర్సింహయాదవ్, శిరీష బాబూరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వ్యక్తి అదృశ్యం

మోతీనగర్: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీపతి ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. శివాజీనగర్‌కు చెందిన బళ్లారి శ్రీనివాస్(41) వెల్డింగ్ పని చేస్తూ జీవనం కొనసాగిస్తుంటాడు. ఆదివారం రాత్రి భోజనం చేసిన తరువాత ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన భార్య రాజేశ్వరి పరిసర ప్రాంతాలు వెదికినా ఫలితం లేకపోవటంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కూకట్‌పల్లి బీజేపీ ముఖ్యనేతల సమావేశం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ ముఖ్య నేతల సమావేశం సోమవారం కన్వీనర్ శ్రీకర్‌రావు ఆధ్వర్యంలో పీఎస్‌ఎం స్కూల్ ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర బొగ్గు గనుల, పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్ మాధవరం కాంతారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతిఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, కేసీఆర్ పాలన వైఫల్యాలను క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సరిపడా నిధులు మంజూరు చేసినా వాటన్నిటిని కేసీఆర్‌దారి మళ్లించటమే కాకుండా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదంటూ మోదీ ప్రభుత్వంపై విమర్శలు చేయటం సిగ్గుచేటన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అవినీతికి అడ్డాగా మారిందని విమర్శించారు. ప్రధానమంత్రి అన్నా యోజన పథకం ద్వారా పేదలందరికి ఈ ఏడాది మొత్తం ఉచిత బియ్యం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీజేపీ కోశాధికారి శాంతికుమార్, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు హరీష్ రెడ్డి, సీనియర్ నేత వడ్డేపల్లి రాజేశ్వరరావు, వివిధ మోర్చాల పదాధికారులు, డివిజన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్ డివిజన్‌లో గడప గడపకు బీజేపీ

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్‌లో గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా సోమవారం సోమవారం రవికుమార్‌యాదవ్ హెచ్‌ఎంటీ హిల్స్, తులసినగర్‌లలో పర్యటించారు. ప్రగతినగర్ నుంచి హెచ్‌ఎంటీ హిల్స్ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదే విధంగా హెచ్‌ఎంటీ హిల్స్ రిటైర్ ఉద్యోగులకు పెన్షన్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారిని ఆదుకుంటామని తెలిపారు. ప్రజాప్రతినిధులు హెచ్‌ఎంటీ హిల్స్‌పై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, అరుణ్‌కుమార్, వేణుగోపాల్ యాదవ్, చంద్రమౌళి, ఎంకే దేవ్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా సత్యం శ్రీరంగం జన్మదిన వేడుకలు

కూకట్‌పల్లి: టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం జన్మదినం వేడుకలు సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా పలు అనాథాశ్రమాల్లో, చీర్స్ ఫౌండేషన్‌లో పుస్తకాలు, పెన్నులు, నిత్యావసరాలను అందజేశారు. అదే విధంగా పలు డివిజన్లలో శ్రీరంగం ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించి సత్యం శ్రీరంగానికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.





టీపీసీసీ సభ్యుడు సత్యం శ్రీరంగం జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు



విద్యుత్ సరఫరాలో తెలంగాణ ఆదర్శం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం కూకట్‌పల్లి ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్‌లో ×విద్యుత్ ప్రగతి×కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. తెలంగాణ రాక ముందు విద్యుత్ పంపిణీ విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలను ఎవరూ నమ్మలేదన్నారు. నాడు ముఖ్యమంత్రిగా ఉన్న సమైక్య పాలకులు తెలంగాణ ఏర్పడితే విద్యుత్ పంపిణీ విషయంలో అస్తవ్యస్తం అవుతుందని భయపెట్టారన్నారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదని ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో 24గంటలు విద్యుత్ సరఫరా చేసే రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. అలాగే విద్యుత్‌శాఖ ఉద్యోగులు అందరూ నిరంతరం పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని అభినందించారు. నేడు తమలాంటి నాయకులు ప్రజల ముందు ధైర్యంగా నిలబడి తెలంగాణ అభివృద్ధి చెందిందని చెప్పడానికి ఉద్యోగులే ప్రధాన కారణమని తెలిపారు.

నియోజకవర్గాన్ని రూ.వేల కోట్లతో అభివృద్ధి చేసుకుంటున్నాం

కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కూకట్‌పల్లి డివిజన్‌లో 1 కోటి 25 లక్షల రూపాయలతో శంకుస్థాపన చేసుకోవటం ఎంతో ఆనందించదగ్గ విషయమన్నారు. పది ఏళ్ల కాలం ఉంచి కూకట్‌పల్లి నియోజకవర్గానికి వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నామని అన్నారు. గత 60 ఏళ్లలో కాని పనులు నేడు పూర్తి చేసుకున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లయిన సందర్భంగా జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారన్నారు.





కూకట్‌పల్లిలో విద్యుత్ ప్రగతి, అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, విద్యుత్ ఉద్యోగులు

ప్రీమియర్ హ్యాండ్ లీగ్ జోష్

- 'తెలుగు టాలన్స్' నూతన జెర్సీ ఆవిష్కరణ
- జట్టు కెప్టెన్‌గా శుభమ్ షియోరాన్

కేపీహెచ్‌బీకాలనీ: నగరంలో ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ (పీహెచ్‌ఎల్) జోష్ రెండు రోజుల ముందే మొదలైంది. ప్రారంభ సీజన్‌లో తెలుగు ప్రజల తరుపున ప్రాతినిధ్యం వహిస్తున్న 'తెలుగు టాలన్స్' నూతన జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం జేఎన్టీయూహెచ్ ఇండోర్ స్టేడియంలో జరిగింది. వందలాది మంది హ్యాండ్‌బాల్ క్రీడాభిమానులు, విద్యార్థుల సమక్షంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, సమాచార సాంకేతిక శాఖ కార్యదర్శి జయేష్‌రంజన్, జేఎన్టీయూహెచ్ వైస్ చాన్సలర్ ప్రొ. కె.నరసింహారెడ్డిలు అతిథులుగా హాజరై జెర్సీని ఆవిష్కరించారు. ఇదే వేదికపై తెలుగు టాలన్స్ జట్టు కెప్టెన్‌గా హర్యానాకు చెందిన శుభమ్ షియోరాన్‌తో పాటు స్పాన్సర్లను ప్రకటించారు.

◆ ఈ సందర్భంగా తెలుగు టాలన్స్ జట్టు యజమాని అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌కు ప్రధాన స్పాన్సర్‌గా ఏ 23, అసోసియేట్ స్పాన్సర్‌గా ప్యారడైజ్ సంస్థలు వ్యవహరిస్తున్నాయని తెలిపారు. అదే విధంగా జేఎన్‌టీయూ, ఆక్సిలోస్, మల్లారెడ్డి యూనివర్సిటీ, యాడ్ ప్రకాష్ ప్రాజెక్ట్సులు అసోసియేట్ స్పాన్సర్లుగా కొనసాగనున్నాయని ప్రకటించారు. రెండు తెలుగు రాష్ట్రాల తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న తెలుగు టాలన్స్ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చేలా గత 20 రోజులుగా కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు.

◆ జూన్ 8న జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ ఇండోర్ స్టేడియంలో ప్రారంభమయ్యే ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ పోటీలు 25 వరకు కొనసాగుతాయని తెలిపారు. మొదటి సీజన్‌లో 6 జట్లు తలపడనున్నాయని తెలిపారు. కాగా నూతన జెర్సీ ఆవిష్కరణ అనంతరం తెలుగు టాలన్స్ జట్టు ప్రతిభను, నైపుణ్యాన్ని చాటి చెప్పేందుకు ప్రత్యేకంగా నిర్వహించిన ఎగ్జిబిషన్ మ్యాచ్ క్రీడాభిమానుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ మ్యాచ్ నిర్వహణలో హెడ్ కోచ్ ఫెర్నాండోతో పాటు అసిస్టెంట్ కోచ్ సచిన్ పాల్గొన్నారు.



జేఎన్‌టియులో తెలుగు టాలన్స్ నూతన జెర్సీని ఆవిష్కరిస్తున్న జయేష్‌రంజన్, కట్టా నర్సింహారెడ్డి, క్రీడాకారులు

